క్లుప్తంగా

లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం రేపు

గుత్తి: స్థానిక కోటలో కొండపై వెలిసిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈనెల 22న లక్ష్మీ నృసింహుడి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. గంగపూజ, గణపతి పూజ అనంతరం స్వామికి కల్యాణం జరిపిస్తామన్నారు.

23న ఉచిత కంటి వైద్య శిబిరం

పామిడి: పట్టణంలోని షాదీఖానాలో ఈనెల 23న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లపాటి తిరుపతి నాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్య నిపుణుల ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. ఓటర్, ఆధార్, రేషన్ కార్డుల్లో ఏదో ఒకటి రెండు జిరాక్స్ కాపీలు, సెల్ నంబర్‌తో శిబిరానికి రావాలన్నారు.

రవీంద్రారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుందాం


ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పుట్లూరు: వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాలను ఆవిష్కరించారు. మార్చి 13న జరిగే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వెన్నపూస రవీంద్రారెడ్డికి వేయాలన్నారు. ఇప్పటికీ ఓటు నమోదు చేసుకోని పట్టబద్రులు ఈనెల 23వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పామిడి: స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ మెంబర్, సర్పంచులు, అనధికారులు, అనధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

పుట్లూరులో..

పుట్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. సమావేశానికి ముగ్గురు ఎంపీటీసీలు హాజరైనట్లు తెలిపారు. దీంతో సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తామన్నారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు


ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టణంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులను విక్రయించినా, వినియోగించినా చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. సోమవారం పట్టణంలోని మండీబజార్‌లోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తున్న దుకాణదారులకు జరిమానా విధించారు. మరోసారి ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు కమిషనర్ పలు కాలనీల్లో పర్యటించారు. నీటి సమస్యపై ఆరా తీశారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు

యల్లనూరు: ఫ్యాక్షన్ గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. శనివారం రాత్రి వెన్నపూసపల్లిలో చంద్రశేఖర్ రెడ్డి చీనీచెట్ల నరికివేత విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నామన్నారు. పలు కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. చీనీచెట్లను నరికిన వ్యక్తులను త్వరలోనే గుర్తించి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. మండలంలో ఎక్కడైనా గొడవలు ఉంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. గొడవలను ప్రోత్సహించినా సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.

నేత్రపర్వంగా రథోత్సవం


రథోత్సవంలో ఈశ్వరుడి బొమ్మను ఊరేగిస్తున్న దృశ్యం


రథాన్ని లాగుతున్న భక్తులు


రథంలో కొలువుదీరిన రాజరాజేశ్వరీ దేవి సమేత బుగ్గరామలింగేశ్వరుడు

- వైభవంగా రాజరాజేశ్వరీ దేవి, బుగ్గరామలింగేశ్వర స్వామి కల్యాణం
- శివ నామస్మరణతో మార్మోగిన పురవీధులు

తాడిపత్రి టౌన్: బుగ్గరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు సోమవారం ఉదయం కల్యాణం, సాయంత్రం రథోత్సవం నేత్రపర్వంగా సాగాయి. భారీగా తరలివచ్చిన భక్తులతో తాడిపత్రి పట్టణం కిటకిటలాడింది. రథోత్సవ సమయంలో పట్టు వస్త్రాలు, స్వర్ణ ఆభరణాల అలంకరణతో రాజరాజేశ్వరీదేవి సమేత బుగ్గరామలింగేశ్వరులు దేదీప్యమానంగా విహరించారు. అనంతరం ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా గాంధీకట్ట వద్ద నుంచి రథంపై ఉంచారు. రథోత్సవాన్ని ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి సాయి ప్రతాపరెడ్డి, తహసీల్దార్ మునివేలు, పట్టణ, రూరల్ సీఐలు ఆనందరావు, చిన్నపెద్దయ్య, ఆలయ ఈఓ నరసయ్య, కమిటీ చైర్మన్ ఆంజనేయులు, కమిటీ సభ్యులు అర్చకులు ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు.

పోటెత్తిన భక్తులు

హరహర మహదేవ శంభో శంకరా.. కైలాస నాథ భక్తుల నామస్మరణాలతో భక్తులు రథం లాగారు. స్థానిక గాంధీకట్ట నుంచి మెయిన్ బజారు, పాత బస్టాండు, అశోక్ పిల్లర్, సీబీ రోడ్డు, పోలీస్ స్టేషన్ రోడ్డు మీదుగా బుగ్గరామలింగేశ్వర స్వామి స్వామి రథోత్సవం సాగింది. రథోత్సవంలో ఈశ్వరుడి బొమ్మ ప్రదర్శన, భక్తులు ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. పట్టణంతో పాటు పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే తనయుడు

బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం జరిగిన రాజరాజేశ్వరీ దేవి సమేత బుగ్గరామలింగేశ్వర స్వామి కల్యాణానికి ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి సాయి ప్రతాపరెడ్డి ఆలయ అర్చకులకు పట్టు వస్త్రాలు అందజేశారు. అనంతరం సాయి ప్రతాపరెడ్డి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వేడుకగా కల్యాణం..


అంతకుముందు ఆలయ అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ ఆవరణలో రాజరాజేశ్వరీ దేవి సమేత బుగ్గరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు కల్యాణం జరిగింది. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ నరసయ్య, బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఆంజనేయులు, చింతల వెంకటరమణ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ బాణా నాగేశ్వరరెడ్డి, ఆలయాల కమిటీ సభ్యులు రాఘవేంద్రారెడ్డి, రమేష్, హరిప్రసాద్, భగీరథమ్మ, లక్ష్మీదేవి, సంజన్న, హరి ప్రసాద్, లక్ష్మీదేవి, రమాదేవి, ఆలయ అర్చకులు మహేశ్వరశర్మ, శంకరశర్మ, గిరిశర్మ, నందుశర్మ పాల్గొన్నారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం


తాడిపత్రి టౌన్: పార్వతీ పరమేశ్వరులకు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

తాడిపత్రి టౌన్: మెయిన్ బజార్‌లోని కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ తలుపుల సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో పార్వతీ సమేత పరమేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. తొలుత పార్వతీ సమేత పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం వేద మంత్రాల మధ్య స్వామికి కల్యాణం జరిపించారు. కల్యాణానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగిన రాజరాజేశ్వరీదేవి సమేత బుగ్గరామలింగేశ్వరస్వామి కల్యాణానికి ఆలయ కమిటీ చైర్మన్ సురేంద్రనాథ్ పట్టు వస్త్రాలు సమర్పించారు. కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయ పరిధిలోని పలు ఆలయాలకు 14 కిలోల వెండి ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి అశ్వర్థ రంగయ్య, కోశాధికారి వంకదార రాజా తదితరులు పాల్గొన్నారు.

చితంబరి స్వామి రథోత్సవం..


రథంపై కొలువుదీరిన చితంబరి స్వామి

గార్లదిన్నె: మండల పరిధిలోని పెనకచెర్లలో శివరాత్రి పండుగను పురస్కరించుకుని చితంబరిస్వామి తిరునాలను మూడు రోజులు వైభవంగా నిర్వహించారు. శివరాత్రి పండుగ జాగరణ మరుసటి రోజు చితంబరస్వామి రథోత్సవం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. అందులో భాగంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకూ రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చితంబరి స్వామి పుష్ప రథాన్ని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. చుట్టు ప్రక్కల గ్రామాలు, జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ సాగర్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏఎన్‌ఎంకు షోకాజ్ నోటీస్ జారీ

గుంతకల్లుటౌన్: బడుగుజీవుల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య బీమా పథకం ఆయుష్మాన్ భారత్ కింద లబ్ధిదారుల వివరాల నమోదు, తదితర అంశాల్లో అలసత్వం వహించిన కారణంగా 33వ వార్డు సచివాలయ ఏఎన్ఎం మేరీసుజాతకు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న షోకాజ్ నోటీసు జారీ చేశారు. సోమవారం ఉదయం సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కమిషనర్.. ఆయుష్మాన్ భారత్ పథకం కింద లబ్ధిదారుల నమోదులో పురోగతి లేని కారణంగా షోకాజ్ నోటీసు అందజేశారు. మిగిలిన ఏఎన్ఎంలు వార్డు వలంటీర్ల సహకారంతో వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మెప్మా టీపీఆర్‌ఓ మోహన్ పాల్గొన్నారు.

గడ్డపార తగిలి ఉపాధి కూలీకి గాయాలు


చికిత్స పొందుతున్న రామాంజినమ్మ

గుత్తి రూరల్: మండలంలోని యంగన్నపల్లి గ్రామంలో సోమవారం గడ్డపార తగిలి రామాంజినమ్మ అనే ఉపాధి కూలీకి గాయాలయ్యాయి. వివరాలు.. రామాంజనమ్మ గ్రామ శివారులో ఉపాధి పనులకు వెళ్లి గుంత తవ్వుతుండగా ప్రమాదవశాత్తూ గడ్డపార తలకు బలంగా తగలడంతో తీవ్రంగా గాయపడింది. గాయపడిన ఆమెను తోటి కూలీలు చికిత్స నిమిత్తం వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మద్యం విక్రేత అరెస్ట్

గుత్తి: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన మద్యం విక్రేత చిరంజీవిని సెబ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సెబ్ సీఐ వరలక్ష్మి నేతృత్వంలో ఎస్సీ కాలనీలో పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. అక్కడ చిరంజీవి అనే వ్యక్తి మద్యం బాటిళ్లను అక్రమంగా దాచి ఉంచి విక్రయిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

నాయీ బ్రాహ్మణులపై దాడి దుర్మార్గం


ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయీ బ్రాహ్మణులు

యాడికి: నాయీ బ్రాహ్మణులపై దాడి చేసిన వారిని శిక్షించాలని లేకుంటే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లనూరు ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని నాయీ బ్రాహ్మణులతో కలిసి నిరసన చేపట్టారు. దాడి చేసిన వారిని శిక్షించాలని ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లనూరు ప్రసాద్ మాట్లాడుతూ.. స్థానిక కుంటలో సెలూన్ షాపు నిర్వహిస్తున్న నారాయణ స్వామిపై గత నెల 25న మండల కేంద్రానికి చెందిన జాఫర్, ఖాజా ఇద్దరు కులం పేరుతో దూషించి, దాడి చేశారన్నారు. సదరు వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినా.. అరెస్ట్ చేయలేదన్నారు. నారాయణ స్వామిపై దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేస్తామని సీఐ రామకృష్ణ, ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తూట్రాళ్ల పల్లె సర్పంచు సంజీవ రాయుడు, మండల నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రామేశ్వరుడు, సుబ్బు, రామకృష్ణ, చంద్ర, బాబు, రంగనాథ, బాలాంజనేయులు, చందన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు


వసంతోత్సవం సందర్భంగా పూజలు చేస్తున్న అర్చకులు

యాడికి: మండలంలోని కోనుప్పలపాడు సమీపంలోని కోన క్షేత్రంలో రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. పురోహితుడు హరికృష్ణ శర్మ ఆధ్వర్యంలో కోన రామలింగేశ్వర దేవాలయం వద్ద ఈనెల 18 నుంచి 20 వరకూ రోజుకో ఉత్సవం నిర్వహించారు. వసంతోత్సవాన్ని కోనా జగదీశ్వర రెడ్డి దంపతులు నిర్వహించారు. హాజరైన భక్తులకు కోనా వెంకటశివారెడ్డి దేవానథన రెడ్డి, మోహన్ రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు.

ముగిసిన షటిల్ టోర్నమెంట్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండల పరిధిలోని కల్లూరులో శివరాత్రి పండుగను పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్దపోతుల పవన్ ఆధ్వర్యంలో సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. రెండు రోజులు పాటు జరిగిన పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 32 జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన పోటీల్లో అనంతపురముకు చెందిన సునీల్, శ్రీకర్ మొదటి స్థానంలో, కల్లూరుకు చెందిన శ్రీకాంత్, కిశోర్ రెండో స్థానంలో, అనంతపురము పట్టణానికి చెందిన గణేష్, ఉదయ్ మూడో స్థానంలో, కల్లూరుకు చెందిన అంజియాదవ్, సుమన్ నాలుగో స్థానంలో నిలిచారు. అనంతరం విజేతలకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

యువకుడి దుర్మరణం


రామాంజనేయులు (ఫైల్)

పామిడి: ట్రాక్టర్‌ను ఐచర్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పామిడిలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన మల్లికార్జున, రామాంజనేయులు (22) ట్రాక్టర్ డ్రైవర్‌గా, కూలీగా జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఇటుకల లోడును గుత్తిలో దించేసి పామిడికి తిరిగి వస్తుండగా... పామిడి మండలం నీలూరు క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ఐచర్ ఢీకొంది. ఘటనలో రామాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మల్లికార్జునను స్థానికులు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఎస్ఐ చాంద్ బాషా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని ఆరు వార్డుల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్, ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది మురికి కాలువలు శుభ్రం చేశారు.

క్రీడలతో మానసిక, శారీరక వికాసం


క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్ధన

అనంతపురం: క్రీడలతో మానసిక , శారీరక వికాసం సాధ్యమని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్ధన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం–ఓటీపీఆర్ఐ వార్షికోత్సవాలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు వార్షికోత్సవ బ్యానర్‌ను ఆవిష్కరించి, శాంతి కపోతాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జీవితంలో గెలుపు, ఓటమి సహజం అన్న భావనతో గెలుపునకు అహర్నిశలు కృషి చేయాలన్నారు. ఓర్పు, శక్తి, పట్టుదల, సహనంతో క్రీడలు ఆడాలన్నారు. కార్యక్రమంలో ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. గోపీనాథ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: రాబోయే ఎన్నికలకు వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ మండల కన్వీనర్ నగేష్ అధ్యక్షతన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు వలివేడు రాజారెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు రాజారెడ్డి మాట్లాడుతూ.. వలంటీర్లు, గృహసారథులు పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. అందరం కలిసి పనిచేసి రాబోయే ఎన్నికల్లో జగనన్నను గెలిపిద్దామన్నారు. ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి 50 కుటుంబాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు ఎలా తెలియజేయాలో వివరించారు. గత ప్రభుత్వంలో కేవలం టీడీపీ నాయకులు, వారి అనుచరులే లబ్ధి పొందారన్నారు. అయితే జగన్ సీఎంగా గెలిచాక పారదర్శకంగా పథకాలు అందాయన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిగా, జొన్నలగడ్డ పద్మావతిని ఎమ్మెల్యేగా గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, ఎంపీపీ యోగేశ్వరి, వైస్ ఎంపీపీ నరసింహులు, నాయకులు తరిమెల భాస్కర్‌రెడ్డి, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య, జయసుధ, ఎంపీటీసీలు మొరార్జీ, ఉమా, ఆలీ, సునీత, రమేష్, సర్పంచ్‌లు నాగమునెమ్మ, వెంకట్రాముడు, గోపాలురెడ్డి, సరోజమ్మ, ఎస్‌పీ నారాయణరెడ్డి, నల్లపరెడ్డి, రామాంజినేయులు, నాయకులు చెన్నకేశవులు, ఎస్‌పీ నారాయణ, బండి లలితకల్యాణి, శకుంతలమ్మ పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పాలన

బుక్కరాయసముద్రం: దేశంలో ఎక్కడా లేని విధంగా అవినీతి రహిత పరిపాలన అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని శిరిడి సాయిబాబా కల్యాణ మండపంలో జెడ్పీటీసీ భాస్కర్ అధ్యక్షతన గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, నియోజకవర్గ పరిశీలకుడు రాజారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వలంటీర్లు అందిస్తున్న సేవలను అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు చూస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు సంక్షేమ వారధులు వలంటీర్లు అని అన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుక వచ్చేలా కృషి చేయాలన్నారు. ఎవరి ప్రమేయం, లేకుండా అవినీతి లేకుండా నేరుగా నేరుగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరి రమణారెడ్డి, వైస్ ఎంపీపీలు రామగోపాల్, జేసీఎస్ మండల కన్వీనర్ పసులూరు బయపరెడ్డి, నాయకులు పూల నారాయణ స్వామి, రాజశేఖర్‌రెడ్డి, కాలువ నారాయణస్వామి, నారాయణ స్వామి ముత్యాల శీన, ముసలన్న, చంద్రమోహన్, పురుషోత్తం పాల్గొన్నారు.

రోప్‌వే ఏర్పాటు చేయొద్దని వినతి

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులోని పురాతన కుంట నుంచి గుత్తి కోటపైకి రోప్‌వే ఏర్పాటు చేయవద్దని సర్పంచ్ గురుమస్తాన్ కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో తహసీల్దార్ మహబూబ్ బాషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ శివారులో సర్వే నంబర్ 235–ఏలో గుత్తి కోట కింద వైపున పురాతన కుంట ఉందని తెలిపారు. కుంటను పూడ్చి గుత్తి కోట పైకి రోప్‌వే ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారులు పర్యాటక అధికారులకు స్థలాన్ని చూపారన్నారు. కుంటను పూడ్చితే భూగర్భ జలాలు అడుగంటి సమీప బోర్లలో నీళ్లు ఇంకిపోతాయని పేర్కొన్నారు. కుంటలో నీరు నిల్వ ఉండటం వలన పశువులు, పక్షులకు తాగేందుకు అవకాశం ఉంటుందన్నారు. పురాతన కుంటను తొలగించకుండా రోప్‌వే నిర్మాణానికి ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని చూపాలన్నారు.

విద్యుత్ అక్రమ వినియోగదారులపై కేసుల నమోదు

యల్లనూరు: మండలంలోని పీఎం కొండాపురం, బుక్కాపురం, నిట్టూరు, వేములపల్లి, మేడికుర్తి గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 25 మంది వినియోగదారులను గుర్తించి కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏడీలు నాగేంద్ర, రామాంజులరెడ్డి, ఏఈలు అశోక్‌నాయక్, జగన్నాథం, చంద్రశేఖర్, కానిస్టేబుల్ విష్ణువర్ధన్ రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

పాలిసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం: పాలిసెట్–2023కు సంబంధించి ఈ నెల 16 నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల (బోరంపల్లి) ప్రిన్సిపాల్ వైఎస్ శ్రీధర్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. వివిధ కేంద్రాల్లో 10–05–2023న పరీక్ష ఉంటుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, పదో తరగతి పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పాలిసెట్‌కు అర్హులన్నారు. ఓసీ/బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ/ఎస్టీలు రూ.100 చెల్లించి మీ సేవ/ ఆన్‌లైన్, స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలోని హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఏప్రిల్ 30 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం


పాఠశాలకు కుర్చీలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

యాడికి: తాము చదువుకున్న ఉన్నత పాఠశాలను మరువకుండా పూర్వ విద్యార్థులు కుర్చీలు అందజేయడం హర్షణీయమని హెచ్‌ఎం విజయమ్మ తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో 2001–02 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.24 వేలు విలువ చేసే 30 కుర్చీలను సోమవారం పాఠశాలకు వితరణ చేశారు. అనంతరం పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యాడికి ప్రభుత్వ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ నాగరాజు, నారాయణ స్వామి, వెంకటరమణ, పరమేష్, చిన్న ఆంజనేయులు, విశ్వనాథ్, గంగిరెడ్డి, నార్దన, అమర్, రామాంజనేయులు, పాల్గొన్నారు.